ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

3★★

గురువారం 4 జూలై 2024

అట్రాసిటీ కేసుల పరిహారం సకాలంలో అందించాలి 5లో..

రాజకీయ నాయకులకు విరమణ ఉండదు 6లో..



స్థానికం ఇక..ప్రత్యేకం

- ఇప్పటికే ప్రత్యేకాధికారుల చేతిలో పంచాయతీలు
- ముగిసిన మండల పరిషత్, నేటితో జిల్లా పరిషత్ పదవీ కాలం ముగింపు
- పంచాయతీ, పరిషత్ ఎన్నికలపై రాని స్పష్టత
- మండలాలకు, జిల్లా పరిషత్‌కు ఇన్‌చార్జి అధికారులు

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో ఇన్‌చార్జి అధికారులను నియమిస్తున్నారు. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధి కారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతోంది. ఇదే తరహాలో ఇక నుంచి మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల పాలన సైతం జరగనుంది. పల్లె పాలనలో స్థానిక సంస్థలదే కీలక భూమికగా ఉంటుంది. పంచాయతీలు, మండల జిల్లా పరిషత్ పాలక వర్గాలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాయి. ఇదే సమయంలో రాజకీయంగా ఎదగడానికి స్థానిక సంస్థలు నేతలకు నిచ్చెనమెట్లుగా ఉపయోగపడతాయి. అయితే పాలక వర్గాల పదవీకాలం ముగియడాని కన్నా ఆరు నెలల ముందుగానే ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేయాల్సిన ప్రభుత్వం... ఆ విషయాన్ని పక్కన పెట్టేసింది. దీంతో ఇప్పటికే పంచాయతీలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. తాజాగా మండల, జిల్లా పరిషత్‌లు కూడా ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 3వ తేదీన, జిల్లా పరిషత్ పాలక వర్గం పదవీకాలం ఈ నెల 4వ తేదీన ముగియనుంది. దీంతో మండల, జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారులను నియమిస్తున్నారు.

పెదవి విరుపు ...

ఐదేళ్ల పదవీ కాలంలో సాధించినది ఏమీ లేదని మండల, జిల్లా పరిషత్ పాలక వర్గాలు నిట్టూరుస్తున్నాయి. పదవుల్లోకి వచ్చి అన్నీ తెలుసుకునే లోపే కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ సమయంలో దాదాపు రెండేళ్ల పాటు ఏమీ చేయలేని పరిస్థితులు ఎదుర్కొన్నామని పలువురు ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేయలేక పోయామంటున్నారు. ఐదేళ్ల కాలంలో పెద్దగా సాధించిందేమీ లేదని పెదవి విరుస్తున్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంచాయతీల పాలక వర్గాల పదవీకాలం ముగిసి ఐదు నెలల దాటాయి. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ప్రస్తుతం మండల, జిల్లా పరిషత్‌లూ అదే దారిలో పయనిస్తున్నాయి. పదవీ కాలం ముగింపునకు వచ్చినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇక గ్రామీణ స్థానిక సంస్థలన్నీ ప్రత్యేకాధికారుల పాలన కిందకు రానున్నాయి.

ఇప్పటికే పంచాయతీల్లో...

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉండగా 2019 జనవరిలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో రిజర్వేషన్ సమస్యతో మల్లాపూర్ గ్రామ పంచాయతీకి జరగలేదు. మిగితా 379 పంచాయతీలకు ఎన్నికలు జరిగి, 2019 ఫిబ్రవరి 1వ తేదీన పాలక వర్గాలు కొలువుదీరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావించినా ప్రభుత్వం ఆరు నెలల కోసం ప్రత్యేకాధికారులను నియమించింది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పంచాయతీ వ్యవహారాలన్నీ ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శుల నేతృత్వంలో జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల కోసం ఎన్నో ఆశలు ఎంతో మంది పెట్టుకున్నప్పటికీ ఎన్నికలు వాయిదా పడడంతో నీరసపడ్డారు. ఎప్పుడు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారోనని ఎదురు చూపులతో గడుపుతున్నారు.

మండల, జిల్లా పరిషత్‌లదీ అదే దారి..

స్థానిక సంస్థల్లో కీలకమైన మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీకాలం ఈనెల 3వ, 4వ తేదీలలో ముగియనుంది. 2019 మేలో మూడు విడతల్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. జిల్లాలో 18 జడ్పీటీసీ స్థానాలతో పాటు 214ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగిన తర్వాత జూన్ తొలి వారంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఈనెల 3వ తేదీన మండల, 4వ తేదీన జడ్పీల పదవీ కాలం ముగియనుంది. ఇక మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగించనున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణకు ఇప్పటికే వివిధ మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం విధితమే. సంబంధిత అధికారులనే మండల పరిషత్ ప్రత్యేకాధికారులుగా కొనసాగించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులకు మార్గదర్శకాలు అందాయి.

జిల్లాలో 208 ఎంపీటీసీ, 18 ఎంపీపీ, జడ్పీటీసీలు..

జిల్లా వ్యాప్తంగా 18 మండల పరిషత్ అధ్యక్షులు, 18 జడ్పీటీసీ సభ్యులున్నా రు. జిల్లాలోని వివిధ మండలాల్లో 208 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటికి 2019 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం వీటి పదవీ కాలం ముగుస్తుంది. జిల్లాలోని బీర్‌పూర్‌లో 6 ఎంపీటీసీ స్థానాలు, ధర్మపురిలో 13, బుగ్గారంలో 6, గొల్లపల్లిలో 13, ఇబ్రహీంపట్నం 12, జగిత్యాల రూరల్‌లో 16, జగిత్యాల అర్బన్‌లో 4, కథలాపూర్‌లో 13 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అదే విధంగా కొడిమ్యాలలో 12 ఎంపీటీసీ స్థానాలు, కోరుట్లలో 12, మల్యాలలో 14, మల్లాపూర్‌లో 15, మేడిపల్లి లో 15, మెట్‌పల్లిలో 14, పెగడపల్లిలో 13, రాయికల్‌లో 14, సారంగపూర్‌లో 7, వెల్గటూరులో 15 ఎంపీటీసీ స్థానాలున్నాయి.

ప్రత్యేకాధికారులను నియమిస్తున్నాము..: రఘువరన్, జిల్లా స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్



జిల్లాలో మండల పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తున్నాము. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మార్గ దర్శకాలు అందాయి. ప్రస్తుతం ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్న అధికారులను మండల పరిషత్ ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగిస్తున్నాము. జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారి నియామకం కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాల్సి ఉంది. ఇక నుంచి పంచాయతీలు, పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగనుంది.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి ఘన స్వాగతం



రాంచందర్‌కు పూల మొక్క అందిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌కు ఘన స్వాగతం లభించింది. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన వడ్డెపల్లి రాంచందర్‌ను మర్యాదపూర్వకంగా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ కలిసి పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.

ఆగమ పాఠశాల ప్రవేశాలకు ఎంపిక

మల్యాల, జూలై 3: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అధికారులు విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రవేశాలకు గాను 21మంది దరఖాస్తులు చేసుకోగా బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో 9 మంది విద్యార్థులు ప్రవేశాలకు ఎంపికైనట్లు ఈవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జగిత్యాల కమిషనర్‌గా సమ్మయ్య

జగిత్యాల టౌన్, జూలై 3 : జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా హైదరాబాద్‌లో కమిషనరెట్‌లో పనిచేస్తున్న సమ్మయ్యను ఇటీవల నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం సమ్మయ్య కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం చైర్ పర్సన్ అడువాల జ్యోతిని మర్యాద పూర్వకంగా కలువగా శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూలై 3 : రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంబారిపేటలో భూషణరావుపేట సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిం చిన ఎరువుల గోదామును రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలకు అవకాశం ఇచ్చారని వివిధ పార్టీల సిద్ధాంతాలు ఏవైనా రైతుల ప్రయోజనాలు చూడాల్సిన అవసరం ఉందని చెప్పారు. సహకార సంఘాల పాత్ర రైతుల పురోభివృద్ధిలో ఎంతో కీలకమైందని వాటిని ప్రోత్సహించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 9 పెండింగ్ ప్రాజెక్టలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తి చేయాలని సంకల్పించగా అందులో సూరమ్మ ప్రాజెక్ట్ కూడా పరిగణలోకి తీసుకుందన్నారు. అందుకుగాను ప్రభుత్వం మొదటి ప్రాధాన్యంలో భాగంగా నిధులు విడుదల చేయగా పనులు కొనసా గుతున్నాయని చెప్పారు. కుడి, ఎడమ కాలువలకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతుల వివరాలు సేకరించే ప్రక్రియ దాదాపు పూర్తయిందని నష్టపరిహారం చెల్లించి పనులు ప్రారంభిస్తామన్నారు. రాళ్లవాగు కుడి కాలువను మరమ్మతులు చేయడానికి టెండర్లు పిలిచారని రెండు రోజుల్లో ఓపెన్ చేయ బోతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా వరద కాలువ నుంచి సూరమ్మను ఎత్తిపోతలతో నింపడానికి రు. 500 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాని తెలిపారు. గత సర్కారు హయాంలో మంజూరై రద్దయిన రోడ్ల స్థానంలో తిరిగి నిధులు తెప్పించడానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని తదనం తరం పార్టీలకతీతంగా పని చేస్తామన్నారు. అనంతరం గంభీర్‌పూర్‌లో మహిళా గ్రామైఖ్య సంఘ భవనంను ప్రారంభించారు. దూలూరులోని నిరుపేద కుటుంబానికి చెందిన ఆయిలేని సత్యనారాయణ గుండె పోటుతో మృతి చెందగా వారి కుటుంబానికి రు. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు సన్మానం

జడ్‌పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్ల పదవీకాలం నేటితో ముగుస్తున్న నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, జడ్‌పీటీసీ నాగం భూమయ్యను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పూలమాల, శాలువాతో సత్కరించారు. ప్రజాసేవలో ఐదేళ్ళు విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ జవ్వాజి రేవతి, సింగిల్ విండో చైర్మన్ దాసరి గంగాధర్, ఎంపీటీసీ వేముల గంగరాజం, మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గంగ్ర కిరణ్‌రావు, ఎంపీడీవో శంకర్, ఏవో యోగిత, డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు ఉన్నారు.



అంబారిపేటలో గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హోంగార్డుకు పోలీస్ అధికారుల చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 3 : పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న ఇమ్రానుద్దీన్ నెల జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇమ్రానుద్దీన్ అదుకు నేందుకు గాను పోలీస్ అధికారులు ఆసుపత్రి ఖర్చుల కోసం రూ. 1.30 లక్షలను సేకరించి తమ వంతు చేయూతనందించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా ఇమ్రానుద్దీన్ కుంటుంబ సభ్యులకు నగదును అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇమ్రానుద్దీన్ కుటుంబానికి పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతూ నిత్యం ప్రయాణాలు చేసే పోలీస్ అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

ప్రజల్లో ఉన్నవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్, జూలై 3 : పదవులు ఉన్న లేకున్నా ప్రజల్లో ఉన్నవారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని ఎంపీటీసీలతో పాటు పాలకవర్గం ఐదేళ్లకాలం పూర్తికావడంతో రూరల్ ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీటీసీలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ వసంత శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సర్పంచులు, ఎంపీటీసీల పాత్ర కీలకమని, వారు గ్రామాలకు అందించిన సేవలు వెలకట్టలేనివి అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరించినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్లు సందీప్‌రావు, మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, ఎంపీటీసీలు, రూరల్ మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ ఉన్నా.. లేకున్నా ప్రజాసేవ చేయాలి

కొడిమ్యాల, జూలై 3 : పదవీ ఉన్న లేకున్న ప్రజా సేవ చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెన్నేని స్వర్ణలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ పదవీ విరమణ అధికాలకెనని ప్రజాప్రతి నిధులకు కాదన్నారు. ప్రజాసేవతో పాలకులకు గుర్తింపు వస్తుందన్నారు. జిల్లాలో కొడిమ్యాల మండలం అభివృద్ధిలో ప్రత్యేక గుర్తింపు పొంది జాతీయ స్థాయిలో అవార్డును అందుకుందన్నారు. అంతకు ముందు ఎంపీపీ స్వర్ణలత మాట్లాడుతూ పదవీ విరమణ పొందినప్పటికీ ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రజలకు సేవ చేయటానికి ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికి అధికారులు సహకరించాల న్నారు. అంతక ముందు కొడిమ్యాల ఎంపీటీసీ లక్ష్మన్ మాట్లాడుతూ కొడిమ్యాల మండలానికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఐదేళ్లుగా కోరినా మంజూరు చేయలేదన్నారు. అనంతరం కొడిమ్యాల ఎంపీటీసీ రాజేశ్వరీరా జేందర్ మాట్లాడుతూ కొడిమ్యాల పంపు హౌస్ వద్ద ఉన్న 9 ఎకరాల ప్రభుత్వం భూమిలో సాగు చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంపు హౌస్ ఏర్పాటుకు ప్రభుత్వం భూమిని సేకరించగా యజమానులు నష్టపరిహారం పొందికూడ సాగు చేసుకోవటం సరైంది కాదని ఉపాధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. అనంతరం చెప్యాల ఎంపీటీసీ మల్లారెడ్డి, హిమ్మతురావుపేట ఎంపీటీసీ జగన్‌మొహన్‌రెడ్డి, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ మాట్లాడారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ప్రశాంతి, కొడిమ్యాల, తిర్మాలాపూర్ సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రాజేందర్, ఉపాధ్యక్షుడు ప్రసాద్ కోఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్, వివిధ శాఖల అధికారులు చంద్రశేఖర్, జ్యోతి, శ్రీనివాసప్రసాద్, పరమేశ్వరీ, రఘునాథ్, హరిప్రసాద్, మణిదీప్, రాజేష్‌ఖన్నా పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సత్కారం

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నాటికి ఎంపీటీసీల పదవీ కాలం ముగియటంతో జడ్పీ చైర్‌పర్సన్ వసంత సమక్షంలో ఎంపీపీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్, ఎంపీటీసీలు సామల లక్ష్మన్, జమాలుపూరి రాజేశ్వరీరాజేందర్, ఊటుకూరి మల్లారెడ్డి, సింధుమహేందర్‌గౌడ్, మిరియా, జగన్‌మొహన్‌రెడ్డి, సుజాతశోభన్, సుజాత, కోఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్ లను మండల స్థాయి అధికారులు, సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, కార్యాలయ అధికారులు సురేందర్, సురేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల అభివృద్ధికి సహకరించిన అధికారులకు ఎంపీపీ, ఎంపీటీసీలు శాలువాలు కప్పి సన్మానించారు. ఎంపీపీ ఎంపీటీసీలకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.





ఎంపీటీసీలను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వసంత..ఎంపీపీని సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీటీసీలు

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

● ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కులు రాక

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,762 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.125 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 4.980 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం అమలుకు ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, జూలై 3 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులకు బ్రేక్ దర్శనం వెసులుబాటును కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో బ్రేక్ దర్శనం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు చేస్తున్న ప్రయత్నం ఎట్టకేలకు ఫలించనుంది. బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని దానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర దేవదాయశాఖ కార్యాలయానికి పంపించినట్లు రాజన్న ఆలయాధికారులు తెలిపారు. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే బ్రేక్ దర్శనం ఏర్పాటు చేసున్నారు.

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు బ్రేక్ దర్శనం చేసుకునేందుకు వీలుగా ఒక్కొక్కరికి రూ. 300 టికెట్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 10.15 గంటల నుంచి 11.15 వరకు గంటపాటు బ్రేక్ దర్శనం, సాయంత్రం 4 గంటల సమయం నుంచి 5 గంటల వరకు గంటపాటు బ్రేక్ దర్శనం వెసులుబాటు అందుబాటులోకి తీసువస్తున్నట్లు తెలిసింది. రాజన్న ఆలయంలోని ఉత్తర ద్వారం ద్వారా బయటకు వెళ్లు దారి నుంచి గంటపాటు బ్రేక్ దర్శనం లైన్‌ను, లేక ప్రత్యేకమైన ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

కరీంనగర్ బస్టాండ్‌లో చోరీకి యత్నం

● పట్టుకున్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 3: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక పాత నేరస్థుడు ఒక వ్యక్తి జేబులో నుంచి పర్సు దొంగలించే యత్నం చేస్తుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. ఐదు సంవత్సరాల కిందట బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడిన కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన చిలుక రాజు మళ్లీ బుధవారం బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి జేబులో చేతులు పెట్టి దొంగతనానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు నిందితుడిని మూడో టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఏటీఎం కృష్ణ, ఐసిఎస్ రావు, ఏఎస్ఐ లక్ష్మతి, కానిస్టేబుల్ బివి రమణ, విజిలెన్స్ సెక్యూరిటీ ప్రదీప్, మానస, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక మృతి

చందుర్తి, జులై 3: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతున్న బాలిక బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం బండపల్లికి చెందిన కుమ్మరి శ్రీవాణి(15)అనే బాలిక ఈ నెల 1న కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీవాణి మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



సత్తక్కపల్లిలో ఊరేగింపుగా బోనాలతో భక్తులు

మెట్‌పల్లి రూరల్, జూలై3: మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం భక్తులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఇంటికోక బోనాన్ని భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. తయారు చేసిన బోనం భక్తులు నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలతో ఊరిగేంపుగా ఆలయానికి బయలుదేరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, అధిక దిగుబడులతో రైతులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర

మానకొండూర్ : మండలంలోని కొండపల్కల గ్రామంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఎల్లమ్మ పట్నాలు, జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరలో గౌడ కులస్థులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరలో సంఘం నాయకులు మల్యాల మొగిలి, నల్లగొండ రాములు, దూలం సంపత్, బోంగోని కనుకయ్య, మాజీ సర్పంచు కొరిమి పితాంబర్, మల్యాల రాములు, కొరిమి విష్ణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేంపేటలో హరితహారం చెట్లు నరికివేత

మెట్‌పల్లి రూరల్, జూలై, 3 : మండలంలోని వేంపేట గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం నీరుగారిపోతోంది. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి. వేంపేట గ్రామ శివారులో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పూర్తిగా విద్యుత్ లైన్ కిందనే అధికంగా ఉన్నాయి. ఈ మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు అంటుకొనే ప్రమాదం ఉందని సుమారు 100కు పైగా చెట్లను నరికివేశారు. ఈ విషయంపై కార్యదర్శిని అడగగా రోడ్డు పక్కన ఉన్న రైతులు నరికి వేసి ఉంటారని పలువురు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం హరితహారంలో చెట్లను నాటండి అని చెబుతుంటే కొందరు అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణను ఫోన్ ద్వారా వివరణ కోరగా విషయం



వేంపేట శివారులో నరికి వేసిన చెట్లు

తెలయదు, తమ దృష్టికి బుధవారం వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూలై3: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎమ్ఎస్ డబ్ల్యూ, ఎమ్మెస్సీ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై3: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle. cgg. gov.in వెబ్‌సైట్‌లో శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 8,9,15,16,22,23,30,31తేదీల్లో ఉదయం 10గంటల నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. వివరాలకు 0878-68686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

గణేశ్‌నగర్, జూలై 3: పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.జ్ఞానప్రకాష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కోర్సులో ప్రవేశానికి టీఎస్-పాలీసెట్ 2024 పరీక్షలో ఉత్తీర్ణులైన ఎంబైపీసీ ర్యాంక్ విద్యార్థులు అర్హులు. ఈ యూనివర్సిటీ పరిధిలో నాలుగు పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలు, మహబూబ్‌నగర్, మామునూర్ (హనుమకొండ జిల్లా), సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలో మొత్తం 110 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేటు రంగంలో డెయిరీ, పౌల్ట్రీఫార్మ్, పెట్ హాస్పిటల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నట్లు తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.tsvu.edu.inలో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 20లోపు దరఖాస్తు చేయవచ్చని తెలియజేశారు.

కుక్కల దాడిలో వృద్ధ దంపతులకు గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై3: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రామ్ కనుకమ్మ, రామ్ బోషయ్య వృద్ధ దంపతులు కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నారు. బుధవారం ఇంట్లో పడుకొని ఉన్న వృద్ధ దంపతులపై వీధి కుక్కలు దాడి చేశాయి. కనుకమ్మకు కుక్కల దాడిలో కాలుకు గాయాలయ్యాయి. గ్రామస్థులు 108కి సమాచారం అందించడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'


ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ట పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు..అంతర్గత లోపమే

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ జరిగి పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీ లించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలకు నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..
- ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి


అనిత (ఫైల్) రమ్య (ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) చదువుకుంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పణ చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! బాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్టుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగుల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

కూలిన 'నిర్లక్ష్యం'

- కుప్పకూలుతున్న మానేరు వంతెన గర్డర్లు
- ఈ ఏడాది ఏప్రిల్‌లో మూడు.. తాజాగా ఐదు..
- తొమ్మిదేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు

ముత్తారం, జూలై 3: ఏళ్ల తరబడి సాగుతున్న పనులు.. నాణ్యతా లోపం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి నిర్మాణ దశలో ఉన్న వంతెన గర్డర్లు కుప్పకూలాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై సుమారు తొమ్మిదేండ్ల క్రితం ఈ వంతెన పనులు మొదలుపెట్టారు. నాటి నుంచి నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని రెండు జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా మంగళవారం రాత్రి కురిసిన ఈదురుగాలుల వర్షానికి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు పెద్ద శబ్దంతో కిందపడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులు మొదలుకాగా, పనుల్లో అలసత్వం, ఆలస్యం తాజా ఘటనకు కారణంగా కనిపిస్తున్నది. గాలి దుమారమే ఘటనకు కారణమని చెబుతున్నా, వారి నిర్లక్ష్యమే కారణం స్థానిక ప్రజానీకం మండిపడుతున్నది.

● మూడు నెలలైనా కాకముందే..

ఓడెడు వంతెనలోని 10-11 పిల్లర్ల మధ్యలో ఉన్న మూడు గర్డర్లు ఈదురుగాలులకు ఈ ఏడాది ఏప్రిల్ 22న రాత్రి ఇదే విధంగా నేలమట్టం అయ్యాయి. రెండేళ్లుగా వాగు ఉప్పొంగి ప్రవహించడంతో, గర్డర్లకు సపోర్టుగా పెట్టిన చెక్కలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగానే గర్డర్లు నేలకూలాయి. ఈ సంఘటన జరిగి మూడు నెలలైనా గడవకముందే మంగళవారం రాత్రి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు నేలకూలాయి. ఏప్రిల్‌లోనే అధికారులు అప్రమత్తమై ఉంటే తాజా ఘటన జరిగి ఉండేది కాదని ప్రజలు మండిపడుతున్నారు. కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.


మంగళవారం రాత్రి కూలిన గడ్డర్లు


గతంలో కూలిన గర్డర్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు(ఫైల్)

● గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం

రెండు జిల్లాల మధ్య దూరాన్ని తగ్గించేందుకు 2016లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.49కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి కూడా ఈ వంతెన పనుల్లో ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. వానాకాలంలో తరచూ వరదలు రావడం.. సామగ్రి దెబ్బతినడం ప్రధాన సమస్యగా మారింది. దీంతో పాటు కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో జాప్యం నెలకొంది. మధ్యలో మరో రూ.11కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు ఆలస్యమవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వంతెన దెబ్బతిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వంతెనను త్వరగా పూర్తిచేయాలని తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. పనులు మళ్లీ వేగంగా మొదలవుతాయని ఆశించిన స్థానిక ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇటీవల వంతెనను సందర్శించిన అధికారులు పనుల్లో నాణ్యతా లోపం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. కాగా, కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు వేయాలని, అదేవిధంగా పనులు మధ్యలో నిలిపేసిన గత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యమానేరు వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మట్టి రోడ్డు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

మృత్యువుతో పోరాడుతున్న మహిళ

- ఒంటరిగా మిగిలిన మూడేళ్ల కుమారుడు
- వైద్యం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

గంగాధర, జూలై3: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృత్యువుతో పోరాడుతోంది. గంగాధర మండల కేంద్రానికి చెందిన విశ్వనాథం శ్రీనివాస్ కుమార్తె హరిణి(26) నెల రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లగా వివిధ పరీక్షలు నిర్వహించి మెదడు వాపునకు కారణమయ్యే తీవ్రమైన ఎన్‌సెఫలైటిస్ వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. ఇరవై రోజులుగా హరిణి పరిస్థితి రోజురోజుకూ దిగజారి ప్రాణాపాయ స్థితికి చేరింది. ఆపరేషన్ చేస్తే కానీ మెరుగుపడదని తక్షణం రూ.30లక్షలు సమకూర్చుకోవాలని వైద్యులు సూచించారు. ఇప్పటికే అప్పులు చేసి 20 లక్షల పైచిలుకు ఖర్చు చేసి వైద్యం చేయించామని తండ్రి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో మృత్యువుతో పోరాడుతున్న హరిణిని కాపాడాలని తండ్రి శ్రీనివాస్ వేడుకుంటున్నాడు. ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న తన తల్లి విషయం తెలియని మూడేళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలాడు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 3 : మండలంలోని గూడూరు గ్రామంలో మైనర్‌ను కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన బత్తిని ప్రశాంత్ మైనర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి కిడ్నాప్ చేశాడని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం కిడ్నాప్ చేసిన ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

షార్జాలో కొత్తపేటవాసి ఆత్మహత్య


శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై3: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తునికి శేఖర్(27) షార్జాలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శేఖర్ నెల రోజుల క్రితం బల్దియా కంపెనీలో పనినిమిత్తం వెళ్లాడు. జూన్ 22న శేఖర్ అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

కారు ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

మల్యాల, జూలై 3: కొండగట్టు కొండపైన గల బొజ్జపోతన ఆలయం వద్ద ఓ కారు ఢీకొట్టిన సంఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయ్యాయి. ముగ్గురు వ్యక్తులు గత సోమవారం తెల్లవారు జామున టీజీ22జీ4149కారులో వస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడుపడంతో రహదారి పక్కన గల స్తంభాలు విరిగిపోయాయని ట్రాన్స్‌కో రామన్నపేట సెక్షన్ ఏఈఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 3: బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న రాజస్థాన్ హోటల్ యజమానిపై ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అశోక్‌నగర్ ప్రాంతంలో దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా రాజస్థాన్ జై రామ్ దేవ్ బాబా హోటల్లో 14 సంవత్సరాలలోపు బాలుడు పనిచేస్తుండగా రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచారు. అధికారుల ఆదేశాల మేరకు బాలుడిని షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. అనంతరం మూడో ఠాణాలో హోటల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చెక్రధర్‌రెడ్డి, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఆపరేషన్ ముస్కాన్ ఇంచార్జి ఎస్ఐ అన్వర్, టీం సభ్యులు సాగర్, కవిత పాల్గొన్నారు.

ఖనిలో చోరీ

కోల్‌సిటీ, జూలై 3: గోదావరిఖని జీఎం కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు తులం బంగారం, 70తులాల వెండి ఎత్తుకెళ్లినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. జీఎం కాలనీలో నివాసముండే ఎడ్ల పద్మ అనే గృహిణి పది రోజుల క్రితం ఊరికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో బీరులో ఉన్న తులం బంగారం, 70తులాల వెండిని దొంగలు ఎత్తుళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కరీంనగర్ జైలు నుంచి ఆరుగురు ఖైదీల విడుదల

కరీంనగర్ క్రైం, జూలై 2: వివిధ కేసుల్లో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆరుగురు ఖైదీలు బుధవారం విడుదల అయ్యారు. శిక్ష సమయంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి రాష్ట్ర వ్యాప్తంగా 213 మంది ఖైదీలను విడుదల చేసింది. కరీంనగర్ జిల్లా నుంచి ఏడుగురు ఖైదీల విడుదలకు ప్రతిపాదనలు వెళ్లగా ఆరుగురు ఖైదీలు విడుదలయ్యారు. హత్య కేసుల్లో జీవితఖైదు శిక్ష పడిన ఆరుగురు ఖైదీలను మంగళవారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి హైదరాబాద్ చర్లపల్లి జైలుకు తరలించారు. వీరందరికీ అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించిన జైలు ఉన్నతాధికారులు, వారికి ఉపాధి చూపించి విడుదల చేశారు. ఇందులో ముగ్గురికి కరీంనగర్ జైలు పెట్రోల్ బంక్‌లో ఉపాధి కల్పించారు. కరీంనగర్ జిల్లా జైలు నుంచి 2010 నుంచి ఖైదీలుగా ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన మెచ్చే మధు, ముచ్చె ఆశయ్య, ముచ్చె గంగయ్యలతో పాటు ఎస్‌కే ముస్తాక్, సయ్యద్ జుబేర్, పవార్ రాజులు విడుదలయ్యారు. వీరు ఆరుగురు జైలు నుంచి విడుదల అయిన తరువాత శాంతియుతంగా, సత్ప్రవర్తనతో ఉంటానని 50 వేల రూపాయల స్వంత పూచీ కత్తు బాండ్‌పై విడుదల అయ్యారు. గతంలో వీరికి విధించిన శిక్షాకాలం పూర్తి అయ్యేవరకు వారి గ్రామం పరిధిలోని పోలీసు ఠాణాలో ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఏదైనా నేరాలలో పాల్గొంటే రద్దు చేసిన శిక్షను మళ్లీ యదావిధిగా విధిస్తారు.

అట్రాసిటీ కేసుల్లో పరిహారం సకాలంలో అందించాలి

- ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం బాధితులకు సకాలంలో అందించాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవ చేయాలని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాలకు వచ్చిన ఆయన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, పరిశ్రమలు, ఎస్‌సీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్‌సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వివరాల ప్రగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క అధికారి క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అర్హులను మాత్రమే ఎంపిక చేసి లబ్ధి చేకూరేలా చూడాలని, ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్‌సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమా ర్ బాబు, రిసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్‌పీ అశోక్ కుమార్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రావాల్సిన హక్కులను అందించాలి

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎస్సీలకు రావాల్సిన హక్కులు వారికి అందుతున్నాయా లేదా పరిశీలించి సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించామని జాతీయ ఎస్‌సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ పట్టాలు అందించే అవకాశంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలలో ఎస్‌సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్‌పై రివ్యూ చేశామన్నారు. ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ కేసులు సకాలంలో పరిష్కరించాలని, వీటిపై పార్లమెంట్ 2018లో 18 ఏ సెక్షన్ కింద ఎస్‌సీలు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్థులను అరెస్టు చేయాల్సి ఉంటుందన్నారు. అన్యాయం జరిగిన నిమ్న వర్గాల ప్రజలకు అండగా ఎస్‌సీ కమిషన్ ఉంటుందన్నారు. సమావేశంలో జాతీయ ఎస్‌సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమార్‌బాబు, రీసర్చ్ అధికారి వరప్రసాద్‌లు పాల్గొన్నారు. జగిత్యాలకు వచ్చిన జాతీయ ఎస్‌సీ కమిషన్ సభ్యుడు రాంచందర్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాంచందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.


మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

మాజీ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా..?

అధికారుల తీరుపై జువ్వాడి నర్సింగరావు ఆగ్రహం

కోరుట్ల, జూలై 3 : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమాలకు గ్రామ స్థాయిలో ఉన్న మాజీ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ విషయం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి చెక్కులు ఒక ఎమ్మెల్యేనే కాకుండా స్థానికంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల నేతలను భాగస్వామ్యం చేయవలసిన అవసరం అధికారులకు ఉంటుందని అన్నారు. ఇప్పటికైన నియోజకవర్గంలో అధికారులు గమనించి మాజీ ప్రజాప్రతినిధులతో పాటు రాజకీయ నాయకులకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. అధికారులు ఈవిధంగా నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

రాయికల్, జూలై 3: బాసర ట్రిపుల్ ఐటీకి ఇటిక్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీ ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. పాఠశాలకు చెందిన సాయి రిషిత్, సీహెచ్ స్ఫూర్తిలు ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. అలాగే భూపతిపూర్ మోడల్ స్కూల్‌కు చెందిన ఏళ్ళ నవ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మల్యాల: నూకపల్లి మోడల్‌స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసుకున్న సంజన అనే విద్యార్థి బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయింది. పదవ తరగతిలో 9.7జీపీఏ సాధించి ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన సంజనను స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు పలువురు అభినందించారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదివిన సిరికొండకు చెందిన బద్దం పల్లవి అనే విద్యార్థినికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు లభించిందని ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ తెలిపారు. పదవ తరగతిలో 9.7 జీపీఏ మార్కులు సాధించిందన్నారు.

బీర్‌పూర్: బాసర ట్రిపుల్ ఐటీకి బీర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని నందిని ఎంపికైనట్లు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుల మూర్తి తెలిపారు. నందిని పదవ తరగతి ఫలితాల్లో జీపీఏ 9.7 తెచ్చుకుంది. విద్యార్థిని పలువురు అభినందించారు.

సహకార సంఘాలను కాపాడుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూలై, 3 : ప్రాథమిక సహకార సంఘాలు అన్నదాతలకు అండగా నిలుస్తాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సహకార సంఘం బ్యాంకు సౌజన్యంతో నిర్మించిన నూతన ఎరువుల గోదాంను స్థానిక పాలక వర్గంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మాజీ సీఎం కేసీఆర్ భావించి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే రైతు పెట్టుబడి కింద రైతు బంధు, బీమా, రుణాలు, సబ్సిడీ విత్తనాలు అందించామన్నారు. రాబోయే రోజులలో రైతాంగ సంక్షేమానికి తను కట్టుబడి ఉన్నాని, రైతులకు కష్టం రాకుండా సహకార సంఘాల పనితీరు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, పీఎస్‌సీఎస్ ఛైర్మన్ నవీన్, వైస్‌ఛైర్మన్ గోపిడి జగన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు బద్దం శేఖర్ రెడ్డి, పీసు తిరుపతిరెడ్డి, గడ్డం రాజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జువ్వాడి సుమతి వర్ధంతి

ధర్మపురి , జులై 3 : ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు తల్లి స్వర్గీయ జువ్వాడి సుమతి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ రవీందర్, మండల ఉపాధ్యక్షులు రాజేష్, జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిరినాగభూషణం, రైతు బంధు మండల అధ్యక్షులు సౌళ్ల భీమయ్య, మాజీ సర్పంచులు నారాయణ రావు, సంతోష్ రావు పాల్గొన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఫారెస్ట్ రేంజ్ అధికారి షౌకత్‌అలీ



చదును చేసిన అటవీ భూమిని పరిశీలిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి షౌకత్‌అలీ

మెట్‌పల్లి రూరల్, జూలై, 3 : మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని అటవీ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి షౌకత్‌అలీ హెచ్చరించారు. మండలంలోని ఆత్మకూర్ అటవీ ప్రాంతంలోని భూమిలోని చెట్లను తొలగించి, చదును చేసిన భూమని గ్రామస్థులతో కలిసి అధికారులు పరిశీలించారు. గత సంవత్సర కాలం నుంచి మండలంలో వందల ఎకరాల భూములను అక్రమంగా చదును చేసుకుంటూ అక్రమించుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలో ఇచ్చిన పోడు భూముల పట్టాలను పరిశీలించి, వారి హద్దులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోడు భూముల పట్టాలు ఇస్తారనే అపోహతో భూమిని అక్రమం గా చదును చేసుకుంటున్నరని, గతంలో అటవీ భూమిని అక్రమించుకోవడానికి ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా అటవీ భూములను అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని, చదును చేసిన భూమిలో వారి ఖర్చుతోనే చెట్లను నాటిస్తామన్నారు. గ్రామాల్లో చదును చేసిన భూమిలో కుంటా నిర్మించిన తరువాత మొక్కలు నాటుతామని, దీనికి గ్రామస్థుల సహకరించాలన్నారు. ఈయన వెంటా అటవీ అధికారులు, సిబ్బంది, నాయకులు, గ్రాస్థులు, రైతులు ఉన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా ఎంపిక

కోరుట్ల, జూలై 3 : కోరుట్ల పట్టణానికి చెందిన శ్రీగద్దె జగదీశ్వర్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంకు సాధించి ఏవోగా ఎంపికయ్యాడు. కోరుట్ల పట్టణానికి చెందిన శ్రీగాదే జగదీశ్వర్ ఎంఎస్సీ అగ్రీ కల్చరల్ మహారాష్ట్రలోని పర్భనీ యునివర్సిటీలో పూర్తి చేసి ప్రస్తుతం అశ్వారావుపేటలోని శాస్త్ర ఉపన్యాసకుడిగా పని చేస్తున్నాడు. జగదీశ్వర్ 48వ ర్యాంకును సాధించి మండల వ్యవసాయ అధికారిగా ఎంపికవడంతో పలువురు అభినందించారు. జగదీశ్వర్ మాట్లాడుతూ ఐపీఎస్ అవ్వడమే తన లక్ష్యమని తెలిపారు.

ముగిసిన ప్రీస్కూల్ శిక్షణ తరగతులు

మల్యాల, జూలై 3: మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల, గొల్లపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు గత మూడు రోజులుగా నూతన విద్యావిధానంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆట, పాటతో విద్యార్థులకు నేర్పించాలో ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కొత్తగా రుపొందించిన ప్రియదర్శిని పుస్తకంలోని షెడ్యూల్‌ను అనుసరించి నిత్యం కార్యక్రమాలు నిర్వహించాలని సీడీపీవో నర్సింగరాణీ సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లను సత్కరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లు పవిత్ర, సుధారాణీ, ఉమ, రాదిక, లత, నీలిమ, శంకరమ్మ సూపర్‌వైజర్లు మమత, రాజశ్రీ, సుభద్ర, మహేశ్వరీ, జ్యోతి పోషణ అభియాన్ జిల్లా కోఆర్డీనేటర్ మధు, ప్రాజెక్ట్ అసిస్టెంట్ ప్రశాంత్, లక్ష్మన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్సై

మల్లాపూర్, జూలై, 3 : ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ సమానత్వం, ఆడపిల్లల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలు, హెల్ప్ లైన్, తదితర నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అవగాహన సదస్సులో పాల్గొన్న వారిలో సొసైటీ ఛైర్మన్ నర్సారెడ్డి, వ్యవసాయాధికారులు, రైతులు, యువకులు ఉన్నారు.

రాజకీయ నాయకులకు విరమణ ఉండదు

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్
- ప్రజాప్రతినిధులకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు



ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు

కోరుట్ల రూరల్, జూలై 3 : రాజకీయాలలో నాయకులకు విరమణ ఉండదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలతో ఆత్మీయ సంస్కరణ కార్యక్రమం మండల అధికారులు నిర్వహించంగా ఎమ్మెల్యే సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ తోట నారాయణ దంపతులతో పాటు ఎంపీటీసీ సభ్యులను అధికారులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చీటి స్వరూప - వెంకటరావు, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్‌లతో పాటు వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, మాజీ గ్రామ సర్పంచ్‌లు, సింగిల్ విండో ఛైర్మెన్‌లు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

పెగడపల్లి : పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం ఘనంగా నిర్వహిం చారు. ఎంపీపీ గోళి శోభాసురేందర్‌రెడ్డి, జడ్పీ టీసీ కాసుగంటి రాజేందర్‌రావు, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్‌లతో పాటు ఎంపీటీసీల ఐదేళ్ల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళి శోభా సురేందర్ రెడ్డి అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించి శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. తమ ఐదేండ్ల పదవీ కాలంలో చేసిన సేవలను, ప్రజలు, అధికారులు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పర్యవేక్షకులు చక్రధర్, ఎంపీ టీసీల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి రవీందర్, ఎంపీటీసీలు జమున, అంజయ్య, శోభ, సుప్రియ, స్వాతి, విజయలక్ష్మి, లచ్చయ్య, ఏఈ శంషేర్ అలీ, నాయకులు రాజేశ్వర్‌రావు, మల్లారెడ్డి, కొమురెల్లి, సత్యం, స్వామి పాల్గొన్నారు.

రాయికల్: పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీ, మండల పాలకవర్గ సభ్యులు, కో ఆప్షన్ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ఈ సందర్భంగా పాలకవర్గానికి అధికారులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఎంతో ఆత్మీయత, అనురాగాలు పంచుకుంటూ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిసురేందర్, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలోని ప్రజల సహకారంతోనే సేవ చేసే అవకాశం కల్గిందని ఎంపీటీసీ బోగ వందన-గంగాధర్ అన్నారు. బుధవారం ఎంపీటీసీగా ఐదు ఏళ్ల పదవి కాలం పూర్తి కావడంతో గ్రామంలోని నాయకులు, ప్రజలు శాలువ, గజమాలతో సన్మానించారు. ఐదు ఏళ్ల పాలనలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలకు ప్రత్యేక అభినందనాలు తెలిపారు. కరోనా విపత్కర సమయంలోనూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసారని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి కొనియాడారు. పంచాయతీ ప్రత్యేకాధికారి రాజు, కార్యదర్శి ప్రశాంత్, నాయకులు శ్రీనివాస్, జగన్‌గౌడ్, రాజారెడ్డి, శివారెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్, రాజేష్, బ్రహ్మానందం పాల్గొన్నారు.



ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు



జగ్గాసాగర్‌లో ఎంపీటీసీ వందన దంపతులను సన్మానిస్తున్న నాయకులు

గొల్లపల్లి : ప్రజలకు సేవ చేసే అదృష్టాన్ని కల్గించినందుకు ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని ఎంపీపీ నక్క శంకరయ్య పేర్కొన్నారు. ఐదేళ్ల పదవీ కాలం ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని గొల్లపల్లి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ నక్క శంకరయ్య ఆధ్వర్యంలో పాలక వర్గానికి బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఆవుల సత్తయ్య, జడ్పీటీసీ గోస్కుల జలేందర్, ఎంపీటీసీలు లంబ ధనవ్వలక్ష్మన్, తార్పాటి రాజ్యలక్ష్మీరవి, అశోక్, రాజన్న, లక్ష్మీగంగారెడ్డి, సింగిరెడ్డి మధుకర్‌రెడ్డి, లావ ఝాజలపతి, సంతోషిణిమారుతి, నందరవి, మహబూబ్, మంజులరవీందర్ రావులను సన్మానించారు. వైస్ ఎంపీపీని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. సింగిల్‌విండో ఫోరం జిల్లా ఛైర్మన్ డా. సుంకిశాని రాజసుమన్‌రావు, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మారం రాజశేఖర్ పాల్గొన్నారు.

భీమారం, మేడిపల్లి మండలాల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



బతుకమ్మలను ఎత్తుకుని వస్తున్న ఆది శ్రీనివాస్

భీమారం, జూలై 3: భీమారం, మేడిపల్లి మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండలంలోని రంగాపూర్ గ్రామంలోని వాటర్ ప్లాంట్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మహిళా సమైక్య భవనం, సీసీ కెమెరా, వెలమ కమ్యూనిటీ హాల్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం త్వరలో పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న ఎంపీటీసీలను, ఎంపీపీ, జడ్పీటీసీలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ప్రభుత్వ విప్‌కు గ్రామస్థులు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మనాయక కల్యాణ మండపాన్ని ఇక్కడ నిర్మించడం శుభ పరిణామమని, అన్ని కులాలవారికి ఇది వేదికగా జరుగుతున్నందున చాలా సంతోషంగా ఉందన్నారు. అసంపూర్తిగా మిగిలిన కల్యాణ మండపం పనులకు ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు అందేలా చేస్తానని తెలిపారు. రేపటితో పదవీ విరమణ చెందుతున్న వారు చింతించకుండా ప్రజాక్షేత్రంలో ఉంటే రానున్న రోజుల్లో అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే భీమారం మండలానికి జూనియర్ కళాశాల మంజూరు విషయమై అధికారులతో చర్చిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత, జడ్పీ వైస్ ఛైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు, భీమారం మండల అధ్యక్షుడు నరేష్ రెడ్డి, ఎంపీపీ దొనకంటి ఉమాదేవి, ఎంపీటీసీ మ్యాదరి లక్ష్మి, పల్లి అర్జున్, రంగాపూర్ వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు వొద్దినేని మల్హల్ రావు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

కథలాపూర్, జూలై 3 : మండలంలోని సిరికొండ, గంభీర్‌పూర్, భూషణ రావు పేట సింగిల్ విండో సొసైటీల్లో బుధవారం జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లారెడ్డి రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ చేశారు. ప్రభుత్వం రూపొందించి ప్రొఫార్మా మేరకు రైతులతో అభిప్రాయాలను అడిగి నమోదు చేసుకున్నారు. ఐదు, ఐదెకరాల పైబడి, పది ఎకరాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు ఎంత విస్తీర్ణంలో రైతు భరోసా అమలు చేస్తే బాగుంటుదని అడిగి తెలుసుకున్నారు. సీఈవోలు రాంప్రసాద్, విజయ్, అరుణ్, వైస్ ఛైర్మన్లు బత్తుల నరేశ్, శీలం మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

మల్లాపూర్: రైతు భరోసా పథకంపై అన్నదాతలు తమ విలువైన సలహాలు అందిచాలని వ్యవసాయాధికారి లావణ్య కోరారు. బుధవారం మల్లాపూర్, సిర్పూరల్ సొసైటీల అధ్యక్షతన వేర్వేరుగా జరిగిన రైతు బంధు ప్రత్యేక సాధరణ సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం ద్వారా రైతుకు అందే పెట్టుబడి సాయంను 5ఎకరాల వరకు, మరికొంత మంది రైతులు కనీసం 10 ఎకరాల వరకు అందిస్తే బాగుందని పలువురు రైతులు తెలిపారు. దీంతో సాగులో ఉన్న వాటికేనా చేయ్యాని వాటికి పెట్టుబడి సాయం అందించాలలేదా అనే అభిప్రాయాలను రైతుల నుంచి ఆమె సేకరించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్, సిర్పూర్ సొసైటీల కార్యదర్శులు పాదం భూమేష్, రాజేశ్వర్‌రెడ్డి, ఛైర్మన్లు, ఏఈవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సిరికొండ సొసైటీలో రైతుల అభిప్రాయం సేకరిస్తున్న అధికారి

పీఏసీఎస్ సర్వసభ్య ససమావేశం

ధర్మపురి, జూలై 3: ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం డీసీఎంస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మంచిర్యాల జిల్లా సహకార అధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయం సొంతంతగా చేసే ప్రతి రైతుకి ఎకరాలతో సంబంధం లేకుండా ఎంత భూమి ఉంటే అంత భూమికి రైతుబంధు ఇవ్వాలని సభ్యులందరూ ఉకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు సంఘ అడప్షన్ అధికారి బి, రాము, అయ్యోరి రాజేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపు

కొడిమ్యాల, జూలై 3: మండలంలోని హిమ్మతురావుపేటలో బుధవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. సంఘానికి చెందిన మహిళలు ఇంటికొక్క బోనం నెత్తిన పెట్టుకొని ఆలయానికి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించి పిల్లా పాపలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు పునుగోటి కృష్ణారావు, అంబేద్కర్ సంఘం నాయకులు పడిగెల బాబు, దేవయ్య, నేదూరి అంజయ్య, ఆకునూరి మల్లయ్య పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, జూలై 3 : కల్యాణ లక్ష్మి చెక్కులను ఆడబిడ్డల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. పట్టణంలోని 39 మంది లబ్ధిదారులకు, మండలంలోని మాదాపూర్, కల్లూర్, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్‌లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్స్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : పేదింటి ఆడబిడ్డ పెళ్లి ఇంటికి భారం కాకూడదనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకం ప్రవేశపెట్టారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని మేడిపల్లి, సత్తక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట, చెర్లకొండపూర్, బండలింగాపూర్, విట్టంపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రసవ సమయంలో గర్భిణులకు పోషక ఆహారంతో పాటు కేసీఆర్ కిట్ అందజేయడం నుంచి ఉచిత విద్యను అందించి సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పీసు తిరుపతిరెడ్డి, కట్ట శ్రీధర్, ఆకుల రాజారెడ్డి, బద్దం శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కోరుట్లలో కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

తెలంగాణ బోనాల పండుగ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూసి లక్ష్మీనారాయణ గార్డెన్స్‌లో ఈనెల 12వ తేదీన మేదిని లలితా కళాక్షేత్రం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ బోనాల పండుగ పోస్టర్లను కలెక్టర్ సత్య ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. బోనాల పండుగలో భాగంగా బోనాల నృత్యం, గ్రూప్ నృత్యాలు, సినీ, జానపద పాటలు, కూచిపూడి, పేరిణి, భరత నాట్యం, జానపద, సినిమా నృత్యాలు తదితర కార్యక్రమాలను జరుగుతాయని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాట్యాచార్యుడు బొమ్మిడి నరేశ్ కుమార్, ఇతరులు పాల్గొన్నారు.

నిత్యవసరాల అందజేత

మల్యాల, జూలై 3: మండలంలోని లంబాడిపల్లికి చెందిన గడ్డం జలంధర్‌గౌడ్ అనే యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మృతుని కుటుంబానికి నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిత్యవసరాల సరుకులు అందజేశారు. ఈ మేరకు బుధవారం 75 కిలోల బియ్యంతో పాటు నెలకు సరిపడా సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ జవాన్ కీసరి గణేష్, కోరెపు వెంకటేష్, మ్యాదరి లవన్‌కుమార్, బెత్తపు చందు, పొన్నం పవన్, సాయి, గుర్రం వెంకన్న, ఎల్లయ్య, శేఖర్, దేవయ్య, మధు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్లెక్సీల వితరణ

కథలాపూర్, జూలై 3: మండలంలోని బొమ్మెన ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన వినాయక ఫ్లెక్సీ ప్రింటర్ యజమాని కొడిమ్యాల ప్రసాద్ విద్యార్థులకు ఉపయోగపడే ఫ్లెక్సీలను వితరణగా అందజేశారని హెచ్‌ఎం అంబటి రవి తెలిపారు. తెలుగు వర్ణమాల, తెలుగు గుణింతాలు, ఇంగ్లీష్ అల్ఫాబెట్స్, సంఖ్యలు తెలి పే ఫ్లెక్సీలను ఉచితంగా పాఠశాలకు అందజేశారని చెప్పారు. ప్రసాద్‌ను ఉపాధ్యాయులు సాయిరెడ్డి, శివకృష్ణ, రాజేశ్వరి, రమేశ్, వర్ణ అభినందించారు.

జీలుగ పంటను పరిశీలించిన ఏవో

కొడిమ్యాల, జూలై 3: కొడిమ్యాల గ్రామ శివారులోని జీలుగ పంటను, నారు మళ్లను బుధవారం వ్యవసాయ అధికారి పి. జ్యోతి పరిశీలించారు. జీలుగ వేసిన రైతు పూత దశలోకి రాగానే ఆలస్యం చేయకుండా దుక్కిలో కలియదున్నాలన్నారు. జీలుగ వేసిన పొలాల్లో యూరియాను తగ్గించుకుంటూ వాడుకోవాలన్నారు. ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, గ్రీష్మ, లావణ్య ఉన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

పెగడపల్లి, జూలై 3 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం స్థానిక ఎస్ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు పంపిన లింక్‌లు లేదా వెబ్ సైట్‌లను క్లిక్ చేసి మోసపోవద్దని, అపరిచితులకు సీవీవీతో సహా మీ వ్యక్తిగత సమాచారం, ఓటీపీ క్రెడిట్ డెబిట్ కార్డుల సమాచారం ఇవ్వవద్దని, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

మహిళా సంఘ భవనం ప్రారంభం

కోరుట్ల రూరల్, జూలై 3: మండలంలోని యూసుఫ్ నగర్‌లో నిర్మించిన మహిళ సంఘ భవనాన్ని బుధవారం ఎంపీటీసీ ప్రియాంక, గ్రామ స్థాయి నాయకులు ప్రారంభించారు. రూ. 10 లక్షల నిధులతో నిర్మాణం చేసి న మహిళ సంఘ భవనాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గంధ్రాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేష్ గౌడ్, నాయకులు ముక్కెర లింబాద్రి, కరిపే నరేష్, గోపు సురేష్, కార్తిక్, అంజయ్య, గోవర్ధన్, మహిళ సంఘం సీఈవోలు సమీనా, మాధురి, సభ్యులు పద్మ, సుప్రియ, పల్లవి, కల్పన, స్రవంతి, రాధ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌నకు సన్మానం

ధర్మపురి, జూలై 3: ఎంపీపీ, జడ్పీటీసీ పదవీకాలం ముగిసిన సందర్భంగా ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్‌ను బుగ్గారం జడ్పీటీసీ బాదినేని రాజేందర్ బుధవారం కలిసి సన్మానం చేశారు. ఆయన వెంట జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి లక్ష్మణ్, నిశాంత్‌రెడ్డి, సుధాకర్, న్యాయవాది వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్లాస్టిక్ బాగ్ ఫ్రీ డే

జగిత్యాలరూరల్, జూలై 3 : జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి శ్రీ విద్య స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు ర్యాలీగా వెళ్లి గ్రామంలో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలు వారి స్వహస్తాలతో పేపర్‌బాగ్స్ వేసి వారి నైపుణ్యాన్ని చాటుకున్నారు. కరస్పాండెంట్ వెంకటరమణ, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.